# గలగలా గోదారి

-భైరవయ్య

ధాత కరువు తరవాత అంతోటిది కాకపోయినా అలాంటిదే కరువొచ్చి పడిందిరా అబ్బాయ్ ఒకసారి. మూడేళ్ళు వరసగా వానల్లేవురా. అడపాదడపా పడ్డ అర చినుకుల్ని భూదేవి ఆత్రంగా తాగేసిందిరా. వేళ్ళు ఎండిన చెట్లకీ మిగల్లేదు. నోళ్ళు తెరిచిన పిట్టలకీ మిగల్లేదు. మనుషుల సంగతి గొడ్ల సంగతి మరి అడక్కు. మొదటేడు ఎండిపోయిన వెన్నులెండిపోగా, మిగిలిన గింజలేరుకున్నార్రా రైతులు. రెండో ఏడు వెన్ను విరిగిన వరి పైర్లు వెన్నలేవెయ్యలేదు. మూడోఏడు నాట్లే లేవురా. దున్నబోతే నాగళ్ళు విరిగాయే తప్ప, నెర్రెలు విచ్చి కరుడు గట్టిన నల్ల రేగడి మన్ను నలుసంత కూడా బెసగలేదురా అబ్బాయ్. చేల గట్లమ్మట, చేలల్లోనూ, కలుపు మొక్కల్లో - గడ్డి దుబ్బుల్లో - పచ్చనిదో - ఎండినదో ఏదన్నా దొరుకు తుందేమోనని గొడ్లు; ఏ కాయో, ఏ దుంపో, భక్షించ డానికి వీలయ్యేదేదన్నా దొరుకుతుందేమోనని మను షులు వెతుక్కున్నార్రా. అక్కడక్కడ ఏ పెద్ద రైతన్నా చెరువున్నవాడైతే, మిగిలిన ఆ బురద నీళ్ళతోటే ఆ చెరువుగట్టునా, చెర్లోనూ పండించగలిగింది పండించు కుని, ఆ పంటని కాపాడుకోటానికి ప్రాణాల్నైనా యిచ్చెయ్యడానికి సిద్ధపడిపోయాడ్రా. ఎండిన నూతు లెండిపోగా, ఏ దిక్కునన్నా, ఏ నూతులోనైనా నీరుంది అని తెలిస్తే, అక్కడ జాతరే జరిగేదిరా. నూతుల పూడి కలు తీసి లోతులు చేసార్రా. కాలవల్లో నిలువెత్తు గోతులు తవ్వార్రా. అయినా చుక్కనీరు ఛమక్‌మన లేదురా. డొక్కలెండిపోయిన నేలతల్లి ఒగర్చింది తప్ప, ఆమె ఒంటి నుండి చెమట చుక్కైనా పడలేదురా అబ్బాయ్. నిండుగాదులున్న మారాజులూ పస్తు లున్నారు. గాదులే లేని నిత్యమారాజులూ పస్తులున్నారు.

అంతటి కరువులోనూ ఒక్కటే సుగుణంరా అబ్బాయ్. గోడలకీ, గాదులకీ కన్నాలు పడలేదు. తలకాయలు పగల్లేదు. కలిగిన మారాజులు అందరూ కలిసి వూరంతటినీ ఒక్కచోట చేర్చి కలిగింది పంచుకు తిన్నార్రా. కాయ దొరికినా, కసరు దొరికినా వూరంతా కలిసి తలో నలుసు పంచుకున్నారు కానీ, ఎవడికి దొరికింది వాడు ఆబగా మేసెయ్యలేదురా అబ్బాయ్.

కాటన్ దొర, ఆనకట్టలు కట్టి కాలవలైతే వెయ్యగలి గాడు కానీ కరువునాపలేకపోయాడ్రా అబ్బాయ్.

''కరువునాధారం చేసుకుని ఎవడూ దోచుకోలేదా'' అంటావా. దోచుకోకేం. కక్కుర్తి మనుషులు ప్రతీ కాలంలోనూ వున్నార్రా. శాతంలోనే తేడా. నాడు అవకాశాలున్నా సాహసించడానికి జంకేవార్రా. సంఘా నికి భయపడేవారు. పట్టుబడితే, తలకాయలు పెట్టు కోడానికి చోటు దొరకదని జంకేవారు. అయినా అన్ని టికీ తెగించి, ఎవడన్నా సాహసిస్తే, వాడిని పరమ నికృష్టుడిలా చూసేదిరా వూరంతా. అందుకే అంత కరువులోనూ జనం మనుషుల్లా బతికార్రా.

'అలా ఆ కరువు కదం తొక్కిందిరా అబ్బాయ్.


అభిషేకానికి నీళ్ళు లేక గుళ్ళో రామలింగడూ అంగలార్చాడు. సహస్ర ఘటాభిషేకం చేయించగలిగితే నన్నా వానలు పడతాయేమోనని జనమూ అంగ లార్చారు. మంత్రాలతోటే సరిపెట్టుకున్నాడా రామ లింగడు. మనస్సునీ, హృదయాన్నీ కరిగించి మనసారా అభిషేకం చేసార్రా జనం. అయినా వరుణదేవుడు కరుణించలేదురా అబ్బాయ్. మేఘ శకలం మెరవ లేదురా.

ఈలోపున కరువులో అధికమాసంలా దొరతనం వారు గుర్రుమన్నార్రా అబ్బాయ్.

మూడేళ్ళుగా శిస్తులు కట్టలేదాయె. కరణానికీ, మునసబుకీ దొరతనంవారు తాఖీదులు పంపుతూనే వున్నారు. కరణమూ, మునసబూ వూరి పరిస్థితిని వివరిస్తూనే వున్నారు. అయినా తెల్లదొరలూ కరుణించ లేదు. తెల్లదొరల కింద పనిచేసే నల్లదొరలూ కరుణించ లేదు. శిస్తుల తాలూకు బకాయిలు చెల్లించమని అడగ టానికి కరణానికీ, మునసబుకీ నాలుకలూ సహకరించ లేదు.

పరిస్థితి అలా వుందిరా అబ్బాయ్.

దొరతనంవారి నుంచి శ్రీముఖం వచ్చిందిరా. ''నెల రోజుల్లో శిస్తు తాలూకు బకాయిలు అణాపైసల్తో చెల్లు బెట్టకపోతే - పొలాలు, ఆస్తులు, చాలకపోతే చెంబులు తప్పేళాలు కూడా వేలం వేసేస్తా''మని. ఊరు ఊరంతా గగ్గోలుపెట్టిందిరా అబ్బాయ్. చెరువంత గాదులున్న మారాజులే నలుగురైదుగురో, పెళ్ళాల మెళ్ళో పుస్తె లతో సహా తెగనమ్మి కట్టగలరేమో కాని, ఒంటిమీద గావంచాలో, గోచీలో తప్ప మిగలని బక్కజీవులే ఎక్కు వగా మిగిలిపోయిన గ్రామంలో ఏవమ్మి కట్టగల్రా శిస్తులు.




కరణమూ, మునసబూ కచేరీకి పరిగెత్తార్రా అబ్బాయ్. వాళ్ళ వెనక పెద్ద తలకాయలూ కదిలాయి. రెవెన్యూ ఇనస్పెక్టరుకీ, తాసీల్దారుకీ విన్నపాలు విన్న వించుకున్నారు. కలెక్టరుదొరగారి దగ్గర సాగిలపడ్డారు. వూరి పరిస్థితి అర్థం చేసుకోమని బతిమిలాడారు. చినుకు పడేదాకా ఓపిక పట్టమన్నారు. చినుకంటూ పడితే చిల్లర పైసల్తో సహా శిస్తంతా చెల్లుబెట్టేస్తా మన్నారు. ''కానుకలిచ్చుకోడాని కన్నా కానీ డబ్బు లేదు మహాప్రభో'' అని మొరపెట్టుకున్నారు. అన్నీవిన్న దొర తనం వారు ఓరకంట చూడలేదు సరికదా, కొరకొరా మన్నారు. వేలంపాట ఆపేది లేదన్నారు. ''న్యూసెన్స్'' అంటూ కలెక్టరు దొరగారు చిరాకుపడ్డారు. సబ్ కలెక్టరుగారిని, మందీ మార్బలంతో వెళ్ళి వేలంపాట ఏర్పాట్లు పకడ్బందీగా సాగేలా చూడమన్నారు. ఏమీ చెయ్యలేక, వెళ్ళిన పెద్దలువెళ్ళినట్టే వెనక్కొచ్చేర్రా అబ్బాయ్.

''ఏం చేస్తే వూరి పరువు కాపాడబడుతుందో'' అని పెద్ద తలలన్నీ అమ్మవారి చావడి దగ్గర చేరి ఆలోచించా యిరా. వూళ్ళో వున్న బంగారమంతా అమ్మినా ఒక

## ఎగసాయం సెయ్యాలి కదండే

ఏడాది శిస్తు కూడా చెల్లుబాటవడం కష్టం. అమ్మబోతే ఆ వూర్లో కొనగలిగే వాఘుడే లేడు. వూరి పరిస్థితి తెలి సిన పొరుగూరు వాళ్ళు, అయినే కాడికి అప్పనంగా దొబ్బ డానికే చూస్తారు కానీ అసలు రేటివ్వరు. అసలు రేటంటే ఎంతరా అబ్బాయ్. ఆ రోజుల్లో, తులం బంగారం అయిదారు రూపాయలు మించి పలికేది కాదు. అలా ఆ వూరంతా వుతకల్లోకి ఎత్తేసినట్టయిపోయిందిరా అబ్బాయ్.

దొరతనంవారు వూళ్ళోకి దిగార్రా అబ్బాయ్. సబ్ కలెక్టరు దొరగారు, తాసీల్దారు, రెవిన్యూ ఇనస్పెక్టరు-ఇనప బూట్లు వూళ్ళోకి వచ్చేశాయ్. అమ్మవారి చావడి దగ్గర వూరంతా సమావేశమయిందిరా అబ్బాయ్. చావడి మీద కుర్చీలో సబ్ కలెక్టరుదొరగారు కూర్చు న్నారు. తాసీల్దారు, ఇనస్పెక్టరు, కరణం, మునసబూ, పెద్ద రాజుగారూ, పెదకాపూ, అవధానిగారూ, వైద్యం చేసే రామాచారిగారూ, సేనాపతుల నాగన్న, వెంకురెడ్డి ఒకవైపున తాటాకు చదర్ల మీద కుర్చున్నారు. మరోవైపు తణుకునుంచి, గూడెం నుంచీ, రాజ మంద్రం నుంచీ వేలం పాటలో పొలాలు కొనుక్కోడాని కొచ్చిన రైతులున్నారు. వాళ్ళవేళ్ళకి వుంగరాలు, మూతు లకి మీసాలు, బుజాల మీద కండువాలు వున్నాయి. చావడి చుట్టూ వూరుజేరింది. ఓ పక్క బ్రాహ్మలు, కాపులు, రెడ్లు, సేనాపతులు మొదలైన వాళ్ళున్నారు. మరో పక్క శెట్టి బలిజలు, పాలేర్లు మొదలయిన

వాళ్ళున్నారు. ఇంకో పక్క పెదమాంలపల్లి నుంచి, చినమాంలపల్లి నుంచి వచ్చిన జనం వున్నారు. ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు చూసుకుంటున్నారే తప్ప మాటల్లేవురా అబ్బాయ్. వాపడి మీద వూరి పెద్దలు తలకాయ లొంచుకుని కూర్చుంటే, వాపడి కింద జనం చేతి కర్రలమీద తలకాయలాన్చి కిందికి చూస్తున్నారు.

సబ్ కలెక్టరు దొరగారు తాసీల్దారు కేసి చూస్తే, తాసీల్దారు రెవిన్యూ ఇనస్పెక్టర్ కేసి చూసాడు. రెవిన్యూ ఇనస్పెక్టరు లేచి నిలబడి, జనంకేసి చూసి, గుటక మింగి, గొంతుసవరించుకున్నాడ్రా అబ్బాయ్..

ఈలోపున పాటిమీది రామన్న, కర్రమీద వాల్చిన తల పైకెత్తి, 'కరణంగోరో' అని పిలిచాడు.

"ఏమిట్రా" అన్నారు కరణంగారు.

"ఈ సంబరవంతా ఏటండే"

"మన వూరు మూడేళ్ళుగా సర్కారువారికి శిస్తు కట్టలేదని మన వూరి పొలాలు వేలం వేస్తున్నార్రా."

"ఆయ్. అంటే సర్కారోరే మన పొలాలమ్మేత్తా రన్నమాటండే"

"అవునురా"

"అమ్మితే కొనేవాళ్ళుండాలి గదండే"

"వుంటేనే కదరా అమ్మేది"

"ఆయ్. ఎవ్వరండే"

"అదిగో. అక్కడ కూర్చున్నారు గదరా. గూడెం నుంచి, తణుకు నుంచి, రాజమండ్రం నుంచి వచ్చార్రా కొనడానికి."

"ఆయ్. అంటేవాళ్ళవూళ్ళలో కాపరాలెత్తేసి మనూ రొచ్చేత్తన్నారాండే."

"అబ్బే. వాళ్ళకి అక్కడ కూడా ఇళ్ళూ, పొలాలు వున్నాయిరా."

"ఆయ్. మరెగసాయం యెవరు సేత్తారండే."

"వాళ్ళేరా. అంటే కౌలుకిస్తారు. వచ్చి చూసు కుంటూ వుంటారు"

"ఆయ్. బాగుందండే. ఆళ్ళకి పొలాలుండగా, సొంతెగసాయం సెయ్యకుండా, మరి మనూరి పొలా లెందుకండే."

"అదేమిట్రా. చవగ్గా వస్తున్నాయి గదరా. అందు కోసం కొనుక్కుంటున్నారు. వానలు పడకుండా వుండవుగా."

"ఆయ్. సెత్తవండే. అంటే మనూరి పొలాలాళ్ళు కొనుక్కుని, మనూరోళ్ళకి కూలీ యిచ్చి, ఎగసాయం సేత్తారన్నమాట. బాగుందండే. ఎగసాయం సెయ్యాలి గదండే. సేసినప్పుడు సూసుకుందావండే. ఒరే రండిరా. మనకెందుకీ గొడవ" అన్నాడ్రా వాడు, కర్ర నేలకేసి కొట్టి కదుల్తూ. వాడి వెనక మెల్లిమెల్లిగా జనం కదిలార్రా అబ్బాయ్.

నిలబడ్డ రెవిన్యూ ఇనస్పెక్టరు నిలబడ్డట్టే వున్నాడు. వాపడిమీద కలెక్టరు దొరగారు, తాసీల్దారు, మర్యాద కోసం కూచున్న వూరి పెద్దలూ వున్నారు. పొరుగూళ్ళ నుంచి వచ్చినరైతులూ లేరు. వాపడి ముందు జనమూ లేరు.

"వేలం పాటా?" కొనేవాళ్ళుంటే గదరా అబ్బాయ్, పాట!


ఆకర్షణీయమైన సీరియల్స్,
ఉత్సుకతను రేకెత్తించే కథలూ
ప్రముఖులతో ఇంటర్వ్యూలూ
ఇంకా ఎన్నో ఆకర్షణలతో
వెలువడే
వనితాజ్యోతి
మహిళా మాస పత్రిక
చదవండి! చదివించండి!!



**1960 కి ముందుగా మీరు జన్మించినట్లైతే ఈ ప్రకటన పూర్తిగా చదవండి.**



**10 కి 9 మంది పైబడిన 25 ఏళ్ళకి పైబడ్డ వారికి జుట్టు వూడటం సంభవిస్తుంది... మీకు ఇది వారికి తెలియదు!**

**ఆ 9 మందిలో మీరు ఒక్కరైతే పూర్ సిల్వీక్రిన్ వాడటం నేడే ప్రారంభించండి.**

మీ దువ్వెనతో మీ జుట్టును గట్టిగా దువ్వండి. మీ దువ్వెన మీదకి వెంట్రుకలు వచ్చినట్టయితే ఆనవాలు మీ జుట్టు వూడిపోతుందన్న మాట. మీరు వెంటనే—అంటే యిప్పుడే చర్య తీసుకోవాలి లేకపోతే మీ జుట్టు పల్చనై పోయినట్టు మీకు అద్దంలో స్పష్టంగా కన్పించటం ప్రారంభిస్తుంది. ముఖ్యమైన ఎమినో ఏసిడ్‌లు జుట్టుకి సహజమైన ఆహారం అవి కొరతైతే, జుట్టుపల్చబడిపోయి ఆరోగ్యం కోల్పోతుంది వాటి కొరతని తొలగించక పోయినట్టయితే జుట్టు వూడిపోతూనే వుంటుంది. అందుచేత మీరు పూర్ సిల్వీక్రిన్ వాడటాన్ని ఈ రోజే ప్రారంభించటం అవసరం




**పూర్ సిల్వీక్రిన్‌లో ఏమిటి ఉంటాయంటే :**

① పెద్దది చేసిన ఒక పూర్ సిల్వీక్రిన్ చుక్క సహజ జుట్టు అవసరాలని తీర్చేందుకు దేహం సమకూర్చే 17 ఎమినో ఏసిడ్‌ల అపూర్వ సమ్మేళనమే పూర్ సిల్వీక్రిన్.

**పూర్ సిల్వీక్రిన్ ఎలా పని చేస్తుందంటే :**

② లోపలకు చొచ్చుకు వెళ్ళే చర్య

పూర్ సిల్వీక్రిన్ వెంట్రుకల మొదళ్ళలోపలకు వెళ్ళేదాకా దాన్ని తలమీద చర్మ భాగంలో యింకేట్టు బాగా మర్దనం చెయ్యండి శాస్త్ర పరిశోధనలతో రూపొందించి పూర్ సిల్వీక్రిన్‌లో ఇమిడ్చిన ప్రక్రియ పద్ధతి యిప్పుడు పని చెయ్యటం ప్రారంభిస్తుంది; మళ్ళీ జుట్టు పెరుగుదల కొనసాగేట్టు దోహదం చేస్తుంది. మీ జుట్టు మళ్ళీ యథా ప్రకారం ఆరోగ్యంగా పెరిగే వరకూ మీరు పూర్ సిల్వీక్రిన్‌ని రోజుకి రెండుసార్లు చొప్పున ప్రతి రోజూ వాడండి.




**పూర్ సిల్వీక్రిన్**

OBM/9824/Tel